క్లుప్తంగా

మా నాయకుడిని విమర్శించే స్థాయి నీకు లేదు

• కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్



నెల్లూరు(బారకాసు): 'కనుమూరి రవిచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పించింది. ఆయనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు' అని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రవిచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ పదవులిచ్చి గౌరవం ఇచ్చిందన్నారు. నేడు అధికారంలో లేదని ఆయన బీజేపీలో చేరి వైఎస్సార్‌సీపీ, జగన్‌మోహన్‌రెడ్డిని ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, మరోసారి ఇలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గూడూరులో కౌన్సిలర్‌గా గెలవలేని పరిస్థితి రవిచంద్రారెడ్డిదని అటువంటి వ్యక్తి తన స్థాయిని మరిచి మాట్లాడటం సరికాదన్నారు.

నరసింహ స్వామి ఆలయంలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: లక్ష్మి జయంతి సందర్భంగా నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆదిలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. కల్యాణోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా డాక్టర్ అనిల్‌కుమార్ జోషి, డాక్టర్ ప్రతిభా జోషి, సాగిరాజు వెంకటరాజు, సునీత వ్యవహరించారు. గరుడసేవ గిరి ప్రదక్షిణ మహోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా పి.ఆనంద్ కుమార్ వ్యవహరించారు. కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవస్థానంలో..



నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమి శుభ శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాలదీపాలు వెలిగించి, ఉద్దీపన పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, 108 నిమ్మకాయల మాల సమర్పించారు. కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాహిత్య సదస్సు రేపు

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలోని ఏసీ హాల్లో విశాలాక్షి మాసపత్రిక సాహిత్య సదస్సు, బహుమతి ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. కోసూరు రత్నం, ఈతకోట సుబ్బారావు, అమీర్‌జాన్, దంపూరు రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

కనులపండువగా బంగారు గరుడసేవ



రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామి వారికి తిరుమంజనం, పూజలు విశేషంగా సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో, రాత్రి బంగారు గరుడసేవలో భక్తులను కటాక్షించారు. సాయంత్రం పూలంగి సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. మోహినీ అవతారం, బంగారు గరుడసేవల ఉభయకర్తలుగా సిద్ధవరపు శివకుమార్‌రెడ్డి, సనాతనరెడ్డిలు వ్యవహరించారు. పూలంగిసేవ ఉభయకర్తలుగా నాయుడు ఆదికేశవరెడ్డి, నారాయణరెడ్డిలు వ్యవహరించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి అళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➡ శ్రీకృష్ణచరిత మానస ప్రచారమండలి ఆధ్వర్యంలో ఛత్రాలను సమర్పించారు. ఆ సంస్థకు చెందిన సభ్యులు నవాబుపేట మైపాడుగేట్ సెంటర్‌లో ఉన్న ప్రసన్న అంజనేయస్వామి వారి సన్నిధి నుంచి రంగనాథుడి వద్దకు గొడుగులు (ఛత్రములు)ను తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గొడుగులతో ఊరేగింపు



రంగులు పూస్తూ..

వీఆర్సీ మైదానంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న జనం





రంగు పడింది..

రంగుల పండగ.. సంతోషంగా..

• సింహపురిలో హోలీ సంబరాలు
• ఆటపాటలతో హంగామా





చిన్నారి సంబరం



నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా రంగుల పండగ హోలీని సింహపురిలో శుక్రవారం ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. నగరంలో జైన్లు, మార్వాడీలు, మరాఠీలు తదితరులు అధికంగా నివసించే రాయాజీవీధి, కాపువీధి, మండపాలవీధి, పెద్దబజారు, చిన్నబజారు, సంతపేట తదితర ప్రాంతాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. సంప్రదాయాలను పాటిస్తూ బుజబుజనెల్లూరు, ఆర్టీసీ కాలనీ, పొదలకూరురోడ్డు, మూలాపేట, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట తదితర ప్రాంతాల్లో ఆటపాటలతో సందడి చేశారు. బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి చిన్నారుల నుంచి పెద్దల వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. బుజబుజనెల్లూరులో ఆర్టీసీ కాలనీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హోలీ పండగను నిర్వహించారు. అలాగే జెండావీధి బొందిలివీధిలోని హనుమాన్ మందిరం వద్ద వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హోలికా దహనం (కామదహనం) నిర్వహించారు. సంప్రదాయంగా నృత్యాలు చేశారు. మండపాలవీధిలోని మరాఠి మిత్ర మండలి అధ్యక్షుడు దేవాశేట్ ఆధ్వర్యంలో హోలికా దహనం జరిగింది. వీఆర్సీ మైదానంలో వేడుకల్లో యువత ఉత్సాహంగా పాల్గొంది.



మండపాలవీధిలో రంగులు చల్లుకుంటున్న యువకులు





యువతుల కోలాహలం



రంగులమయం



ఆర్టీసీ కాలనీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



హనుమాన్ మందిరం వద్ద హోలికా దహనం

పార్లమెంట్ పరిశీలకుడికి సన్మానం



ఆదాలను సత్కరించిన నాయకులు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రూరల్ నియోజకవర్గ నాయకులు శుక్రవారం మినీబైపాస్‌రోడ్డులో ఉన్న కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన కేసరి శ్యాంసింగ్, వాణిజ్య విభాగం మండలాధ్యక్షుడిగా నియమితులైన కొండ సతీష్ తదితరులు ఆదాల, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా మస్తాన్‌రెడ్డి, నాయకులు స్వర్ణ వెంకయ్య, కొండేటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

➡ 19వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనారిటీ నాయకుడు షేక్ షబ్బీర్ ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను ఆదాల పరామర్శించారు. రంగారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత అంతిమయాత్ర వాహనం ప్రారంభం



నెల్లూరు రూరల్: పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు సంబంధించిన ఉచిత అంతిమయాత్ర వాహనాన్ని రామ్మూర్తినగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వాహనం అవసరమైన వారు 91827 35449 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, నేతలు నరసింహనాయుడు, గడ్డం విజయ్‌కుమార్, యారబోలు రాజేష్, చిలకా ప్రవీణ్‌కుమార్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, గిరికుమార్‌గౌడ్, కుప్పా ప్రసన్న, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్థానిక మినీబైపాస్‌లోని గెస్ట్‌ఇన్‌లో శుక్రవారం జిల్లా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా పల్లా శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా యనమల జానకిరామ్ నియమితులయ్యారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు దామినిబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉడతా వెంకటేశ్వర్లు, జగదీష్, కాళ్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మన్మథరావు, మురళి, శివ, సుకుమార్, సురేష్‌బాబు, కోటేశ్వరరావు, సుంకు వెంకటేశ్వర్లు, గురవయ్య, ప్రవీణ్, ప్రసాద్, జయరామయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నెల్లూరు(టౌన్): ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ ఆర్.బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, ఇంకా పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 వరకు తరగతులు జరపాలన్నారు.

ఆధునిక వసతులతో క్రిటికల్ కేర్ యూనిట్



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రూ.24 కోట్లతో ఆధునిక క్రిటికల్ కేర్ యూనిట్ భవన సముదాయాన్ని నిర్మిస్తున్నట్టు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన యూనిట్ నిర్మాణాన్ని పరిశీలించారు. జూలై 30వ తేదీలోపు పూర్తి చేసి మంత్రులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. హెచ్‌డీఎస్ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.నాగరాజమన్నార్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జనార్దనరెడ్డికాలనీ ఫీడర్‌లో మరమ్మతులు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న కారణంగా జనార్దనరెడ్డికాలనీ, పెద్ద మసీదు సెంటర్, అలీ నగర్, లక్ష్మీపార్వతీనగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

➡ గోమతినగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా గోమతినగర్, ఇస్కాన్ సిటీ, శ్రీహరినగర్, రామలింగాపురం, మినీబైపాస్‌రోడ్డు, హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ప్రాంతం, లెక్చరర్స్ కాలనీ, సర్వేపల్లి కాలువకట్ట, పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా నిలిపేస్తారన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీఆర్‌కు రైల్వే సీఐ బదిలీ

నెల్లూరు(క్రైమ్): అవినీతి ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రైల్వే సీఐగా భుజంగరావు 2023 సెప్టెంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఆయనపై ఆరోపణలున్నాయి. ఈ విషయమై కొందరు సిబ్బంది గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనాను స్వయంగా కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల జనవరి నెలాఖరున నెల్లూరులో ఎస్పీ విచారణ చేశారు. ఈక్రమంలో భుజంగరావును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం): చెన్నైకి చెందిన షెల్టర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది బాలలకు పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, ట్రస్ట్ నిర్వాహకుడు సాల్మన్ రాజ్, కో–ఆర్డినేటర్ స్టీవెన్, సభ్యుడు శివకుమార్, ప్రసాద్, ఎ.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణితో ఆదాల భేటీ



గోవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో శుక్రవారం నెల్లూరు మాజీ ఎంపీ, ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న జిల్లా కార్యాలయంలో ఇరువురు నాయకులు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, హరిబాబు యాదవ్, ఏసునాయుడు, మల్లు సుధాకర్‌రెడ్డి, వైవీ రెడ్డి, కొండేటి నరసింహారావు, స్వర్ణ జీవన్ ప్రసాద్, శ్రీధర్‌బాబు, కల్లూరు లక్ష్మీరెడ్డి, నాగ శ్రీనివాసులురెడ్డి, షేక్ అల్లాభక్షు, షేక్ జిలానీ, బెల్లంకొండ వెంకయ్య, నానీ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భక్తిశ్రద్ధలతో గౌర పూర్ణిమ



అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌రోడ్డు వద్ద ఇస్కాన్ మందిరంలో శుక్రవారం గౌర పూర్ణిమను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో మందిరంలో గౌరనితాయ్‌కి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా శుకదేవస్వామి ఉపన్యసిస్తూ కలియుగంలో హరినామ సంకీర్తన ముక్తికి ఏకైక మార్గమన్నారు. సాక్షాత్తు భగవంతుడే గౌరవ ప్రభువుగా అవతరించారన్నారు. హరేకృష్ణ హరేరామ మహామంత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉద్యమంగా తీసుకెళ్లి ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించిన గౌరంగ ప్రభువు ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎస్పీ సతీమణి ప్రణవ్ గౌతమి విచ్చేసి అభిషేకాలు నిర్వహించారు.

నేత్రదానం



కొండలరావు కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న సునీల్



నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఐ టెక్నీషియన్ సునీల్

నెల్లూరు(అర్బన్): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించడంతో వారి నేత్రాలను కుటుంబ సభ్యులు నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. కావలి పట్టణం శాంతినగర్ నివాసి తల్లూరు కొండలరావు (62) శుక్రవారం మృతిచెందారు. కుటుంబ సభ్యురాలు తల్లూరు మనస్విత కోరిక మేరకు కొండలరావు నేత్రాలను సేకరించినట్లుగా అభయం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు శ్రీవాణి తెలిపారు.

➡ కావలి పట్టణం బృందావనం హౌసింగ్ కాలనీకి చెందిన బైసాని చిన్న మాలకొండ్రాయుడు (85) శుక్రవారం చనిపోయారు. కుటుంబ సభ్యుడు సురేష్ కోరిక మేరకు మాలకొండ్రాయుడి నేత్రాలు సేకరించినట్లుగా శ్రీవాణి తెలిపారు. కళ్లను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించి నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకున్న వారు 99595 89321, 80740 83545, 94946 08060, 98666 16525 ఫోన్ నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

➡ తమిళనాడు హోసూరుకి చెందిన ప్రదీప్ (27) శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో నాయుడుపేట ప్రాంతంలో మృతిచెందాడు. చిరంజీవి ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో ప్రదీప్ నేత్రాలను తండ్రి గోవిందరాజన్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు.